క్లుప్తంగా

హక్కులను సాధించుకోవాలి

పటాన్‌చెరు టౌన్: ముదిరాజ్‌లు ఒకేతాటిపైకి వచ్చి తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారని ఎస్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. చేవెళ్ల పట్టణంలో పండుగ సాయన్న విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కాలే యాదయ్య, సంగారెడ్డి నియోజకవర్గ బీజేపీ నాయకులు పులిమామిడి రాజు, కాసాని వీరేష్, లల్లు ముదిరాజ్, యాంకర్ బిత్తిరి సత్తి, దగడ్ సాయితో కలిసి నీలం మధు హాజరై మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ఇవ్వండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్స్

సంగారెడ్డి టౌన్: మధ్యంతర భృతి 15శాతం ఇవ్వాలని కోరుతూ తెలంగాణ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం మధ్యంతర భృతి 5శాతం ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు సవరించడానికి వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టు విడుదల



ఓటరు లిస్టును విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో ఓటరు లిస్టును కమిషనర్ సంగారెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో 33384మంది ఓటర్లు ఉన్నారన్నారు. గతంతో పోలిస్తే 7695 మంది ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయని తెలిపారు. అన్ని బూత్‌లతో ఓటరు లిస్టు అందుబాటులో ఉందని వివరించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి హనుమంతరావు అన్నారు. గురువారం సంగారెడ్డిలోని జెడ్పీహెచ్‌లో బాలికల పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహహింస, వరకట్న నిషేధం, బాలకార్మిక వ్యవస్థ, తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ప్రారంభం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని వీరప్పబస్తీలో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ అస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన

వట్‌పల్లి(అందోల్): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం జోగిపేటలో ఆకులు తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేసి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, కార్మికులు సావిత్రి, మరియమ్మ, రత్నమ్మ, పుష్పమ్మ, లక్ష్మి, లక్ష్మమ్మ పాల్గొన్నారు



ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గ్రామీణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ వ్యవస్థలో సీఎం కేసీఆర్ విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి, ఐనోలు గ్రామాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులు, ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని సాయితేజ కాలనీలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామసభల ద్వారా ప్రతి కాలనీలో మౌలిక వసతులను కల్పిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, ఆయా గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

పటాన్‌చెరు మండలంలోని అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీకి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే



ఐనోల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మహిపాల్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటయిన అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నేటి వరకు రూ.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నందారం నరసింహాగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నియోజకవర్గం పరిధిలోని 122 తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి గురువారం స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారిగా ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ప్రభుత్వం అందించిన క్రీడా పరికరాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాలను అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేవిధంగా కృషి చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భూకబ్జాలపై విచారణ జరిపించండి



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకుడు మాణిక్

సంగారెడ్డి అర్బన్: జిల్లాలో భూకబ్జాలపై సమగ్ర విచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంగారెడ్డిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అసైన్డ్‌మెంట్, చెరువు శిఖం భూములను కొంతమంది రాజకీయ నాయకులు అధికారుల అండదండతో కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం పేదల ఇచ్చిన భూములకు కొత్త పాస్ పుస్తకాలను ఇవ్వకుండా బ్లాక్ లిస్టులో పెడుతున్నారన్నారు. పేదలు ఇంటి స్థలం అడిగితే భూములు లేవు అంటున్నారని వాపోయారు. ఐలాపూర్ భూకబ్జాలపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్ ఆదేశించినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూకబ్జాదారులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, కంది మండల అధ్యక్షుడు ప్రభాకర్, సంగారెడ్డి మండల కార్యదర్శి దివాకర్, నాయకులు దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమణ

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఐక్యంగా ఉద్యమించడంతోనే సమ్మె డిమాండ్లను సాధించుకున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. డిమాండ్ల సాధన కోసం 24 రోజులుగా అంగన్‌వాడీ సమ్మె చేపట్టగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. సమ్మెకు సహరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఏసుమని, రూప, పద్మ, విఠలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంబురాలు

తమ డిమాండ్‌ల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించిన అంగన్‌వాడీలు గురువారం పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శోభ, విజయలక్ష్మి, అక్క మహాదేవి, సబిత, వాసీమా, జగదాంబ, శరణమ్మ పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదగాలి

ఝరాసంగం(జహీరాబాద్): ముదిరాజులు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సంగప్ప, జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దోడి శంకర్ ముదిరాజ్ అన్నారు. గురువారం ఝరాసంగంలో ముదిరాజుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడిగా సంగన్న ముదిరాజును ఎన్నుకున్నారు. తాలూకా ప్రధాన కార్యదర్శి అశోక్, మాజీ అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ శంకర్, నాయకులు కృష్ణ, బస్వరాజ్, నరేష్, లక్ష్మణ్, సిద్ధూ, ప్రభాకర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్స్‌గా యువకుల ఎంపిక

మనూర్(నారాయణఖేడ్): మనూర్ మండలం బోరంచ గ్రామానికి చెందిన ఏడుగురు అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. మారుమూల ప్రాంతమైన బోరంచలోని పేద కుటుంబాలకు చెందిన బుగుడాల మల్లేశ్, గౌనిరాజు, మంగ, వంశీ, బేగరి అనిత, గౌని కార్తీక్, శివ, శంకర్ ఎంపికైన వారిలో ఉన్నారు. కాగా, బాదల్ గ్రామం నుంచి మరో ఐదుగురు అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీంతో ఆయా గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

కానిస్టేబుల్స్‌కు సన్మానం..

వట్‌పల్లి(అందోల్): పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు మండల పరిధిలోని తాడ్మన్నూర్ గ్రామానికి చెందిన సదానందం, సందీప్, నందు, భానుచందర్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ సంగీత, బీఆర్‌ఎస్ అందోల్ యువజన విభాగం మండల అధ్యక్షులు అనిల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం నుంచి నలుగురు యువకులు కానిస్టేబుల్స్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.



ఎంపికైన వారిని సన్మానిస్తున్న నాయకులు

మహిళల అభ్యున్నతికి కృషి

సంగారెడ్డి టౌన్: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు గురువారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, కమిషనర్ సునీత, సడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, జెడ్పీటీసీ సునీతామనోహర్‌గౌడ్, ఎంపీపీ లావణ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు

రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్‌లో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్ పరిధిలో బతుకమ్మ చీరలను స్థానిక కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధుఆదర్శ్‌రెడ్డి కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరాష్ట్రంలో లేనివిధంగా రంజాన్, బతుకమ్మ, క్రిస్మస్ పండుగల సందర్భంగా ప్రభుత్వం పేదలకు నూతన వస్త్రాలను అందిస్తోందని తెలిపారు. మాజీ కార్పొరేటర్ అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని న్యాల్‌కల్, హద్నూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంజమ్మ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తామని తెలిపారు.

నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలి

మునిపల్లి(అందోల్): నిబంధనల ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని ఎంపీడీఓ హరినంధన్‌రావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో స్టాక్ ఉంచిన బతుకమ్మ చీరలను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు.



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు రమావత్ సోనా, జన్ముల వర్ష ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 ఖోఖో బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా రెండవ స్థానం సాధించింది. ఈ నెలలో కోమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపిక అయినట్లు పీఈటీ రాములు యాదవ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను పాఠశాల హెచ్‌ఎం రామ్మోహన్ రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు అభినందించారు.



విద్యార్థినులకు అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

‘కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరం’



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు గాంధీ, గోపీనాథ్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): సీఎం కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ కేసీఆర్ నగర్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జీహెచ్‌ఎంసీ జూనియర్ కమిషనర్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

కంది(సంగారెడ్డి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ నంద కుమార్ తెలిపారు. కందిలోని కిసాన్‌సాగర్ చెరువులో గురువారం చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించుకోవడం జరిగిందన్నారు. చేపలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించుకునేందుకు ప్రభుత్వం మోటర్ బైక్‌లను ఉచితంగా అందజేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, వీరన్న, సభ్యులు పాల్గొన్నారు.



కిసాన్‌సాగర్ చెరువులో చేపపిల్లలను వదులుతున్న ప్రజాప్రతినిధులు

సంక్షిప్త వార్తలు

◆ పీసీబీ అధికారుల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని ఆసానికుంటలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థ ఘన పదార్థాలను పారబోసిన విషయం తెలిసిందే. కాగా గురువారం పీసీబీ అధికారి రవీందర్ సిబ్బందితో కలిసి కుంటలో ఉన్న వ్యర్థాలను పరిశీలించి నమూనాలను సేకరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ జలాలను పారబోయటం సరైంది కాదని, ఇందుకు సహకరించిన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

◆ హైమాస్ట్ లైట్లు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: ఎంపీ బీబీపాటిల్ మంజూరు చేసిన నిధులతో జహీరాబాద్, మొగుడంపల్లి మండలంలోని రంజోల్, సజ్జరావుపేట తండాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆయా గ్రామాల సర్పంచ్‌లు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ ఉద్యోగ భద్రత కల్పించాలి



సంగారెడ్డి టౌన్: కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఈ-పంచాయతీ టెక్నికల్ వింగ్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్ట్ మేనేజర్లు, ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు గురువారం సంగారెడ్డి పట్టణంలో శాంతియుత సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పనిచేస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లకు పేస్కేల్ అమలుచేసి ఉద్యోగ భద్రత కల్పించి ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేసి ప్రత్యేక గ్రాంట్ ద్వారా వేతనం చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు.

◆ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని మందకృష్ణ మాదిగ చేపట్టనున్న మహాపాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం జహీరాబాద్ పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు అబ్రహం మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఈ నెల 7న అలంపూర్ నుంచి మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్ అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె గురువారంతో 13వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

◆ విద్యా సామగ్రి అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెటిరో పరిశ్రమ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, పాఠశాల హెచ్‌ఎం మృదుల, హెటిరో పరిశ్రమ ప్రతినిధి భాస్కర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, లింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పరిసరాలు శుభ్రత పాటించాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రతిఒక్కరూ పరిసరాలు శుభ్రత పాటించాలని మిర్జాపూర్(బి)పీహెచ్‌సీ వైద్యుడు రూపెన్ చక్రవర్తి అన్నారు. మండల పరిధిలోని మిర్జాపూర్(బి)జెడ్పీహెచ్‌ఎస్‌లో వ్యాధులు సోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ శ్యామల, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలి

జహీరాబాద్ టౌన్: టీఎస్‌పీఎస్‌సీని వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరితోనే టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-1 రద్దు అయిందన్నారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డును రద్దు చేసి కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్‌లో..

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దును నిరసిస్తూ ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల పవన్ ఆధ్వర్యంలో పట్టణంలో జాతీయ రహదారిపై గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సంతోష్ ప్రణీత్, అఖిల్, పురుషోత్తం పాల్గొన్నారు.

◆ ‘సేవచేసే అవకాశం ఇవ్వండి’

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గం చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వస్తున్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్), టేకూర్, ముంగి, న్యాల్‌కల్, అత్నూర్, డప్పూర్, ఇబ్రహీంపూర్, చినిగెపల్లి, హుమ్నాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్తగా చక్కెర ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, న్యాల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్య స్వామి, భాస్కర్‌రెడ్డి, విలాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

◆ 15 నుంచి బ్రహ్మోత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): ఈ నెల 15 నుంచి గుమ్మడిదలలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను గురువారం నాయకులు, ప్రజాప్రతినిధులు, దేవాలయ అర్చకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, దేవాలయ ఆలయ అర్చకులు, పాల్గొన్నారు.

ఏపీ విద్యా వ్యవస్థ ఆదర్శవంతం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆంధ్రప్రదేశ్‌లోని విద్యా వ్యవస్థను ఆదర్శంగా తీసుకోవాలని రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెఫర్డ్ అన్నారు. గురువారం తెల్లాపూర్‌లోని అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ ప్రాంగణంలో 206వ భారతీయ ఇంగ్లీష్ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం ఏపీ సీఎం జగన్ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన ప్రారంభించారని తెలిపారు. ఇందుకోసం వేలాది కోట్ల రూపాయలు వెచ్చించారని తెలిపారు.అదేవిధంగా అన్నివర్గాల సంక్షేమం కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. తెలంగాణలో మాత్రం సీఎం కేసీఆర్ విద్యా వ్యవస్థను గాలికి వదిలేశారని ఆరోపించారు. కార్యక్రమంలో అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, కొల్లూరి భరత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంచ ఐలయ్య